క్లుప్తంగా

జీపీడీపీ తయారీపై శిక్షణ

బాడంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జీపీడీపీ(గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు) తయారీపై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వీవోఏలకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో ఎస్.రామకృష్ణ, తదితరులు పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికల తయారీ, వాటి అమలు చర్యలను వివరించారు. గ్రామ పంచాయతీల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా సిబ్బంది పని చేయాలని ఎంపీడీవో సూచించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించనున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని తహసీల్దారు జి.హేమంత్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తితో కలిసి గ్రంథాలయ వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆయన మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నవంబరు 14 నుంచి 20వ తేదీ వరకు జరిగే ఈ వారోత్సవాల్లో పాఠకులకు, విద్యార్థులకు రకరకాల పోటీలు, పుస్తక ప్రదర్శనలు చేపట్టడంతో పాటు వివిధ శాఖలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టనున్నామని లైబ్రేరియన్ తెలిపారు.

బొబ్బిలి: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ మహాసభలు నిర్వహిస్తున్నామని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజశేఖర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కలు కరిచి బాలుడికి తీవ్రగాయాలు


కుక్క కాట్లు చూపిస్తున్న బాలుడు మహేష్

రామభద్రపురం: మండలకేంద్రంలోని గూలవీధికి చెందిన బాలుడిని కుక్కలు కరవగా తీవ్ర గాయాల పాలయ్యాడు. మంగళవారం జరిగిన ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పత్తిగుళ్ల మహేష్ అనే బాలుడు వీధిలో ఆడుకుంటుండగా ఒకేసారి మూడు కుక్కలు మీద పడి మూడు చోట్ల కరిచాయి. దీంతో తీవ్రగాయాల పాలైన బాలుడిని చూసిన స్థానికులు వెంటనే స్పందించి స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లగా అక్కడి వైద్య సిబ్బంది రేబిస్ వ్యాక్సిన్ వేశారు. వీధిలో కుక్కలు గుంపులు,గుంపులుగా తిరుగుతున్నాయని, చిన్న పిల్లలు ఆడుతుండంతో ఎప్పుడు ఏ కుక్క కరుస్తుందోనని భయాందోళన చెందుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తంచేశారు.సంబంధిత అధికారులు కుక్కలను పట్టే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తప్పిన పెను ప్రమాదం

సంతకవిటి: మండలంలోని అక్కరాపల్లి గ్రామానికి చెందిన మొయ్యి సీతయ్యమ్మ ఇంట్లో మంగళవారం గ్యాస్ లీకై రేకు ఇల్లు కాలిపోయిందని ఫైర్ సిబ్బంది తెలిపారు. ఈ ప్రమాదంలో దాదాపు లక్ష రూపాయల ఆస్తి నష్టం వాటిల్లిందని వెల్లడించారు. అయితే ఇల్లు కాలిపోవడం మినహా అదృష్టవశాత్తు ప్రాణనష్టం జరగలేదని, పెనుప్రమాదం తప్పిందని గ్రామస్తులు చెప్పారు.

నిరసనకారులకు బెదిరింపులు!

బొబ్బిలి: పట్టణంలోని మేదరిబంద జంక్షన్‌లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వేరేచోటకు మార్చాలని డిమాండ్ చేస్తూ మహిళలు చేపడుతున్న నిరసన కొనసాగుతోంది. అయితే నిరసనకారులను కొంతమంది బెదిరిస్తున్నారు. ఇదే విషయమై అక్కడి మహిళలు సరస్వతి, అనసూయలు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మద్యం షాపు పక్కనే ఉన్న తమ ఇంటికి అర్ధరాత్రి సమయంలో కొంతమంది దుండగులు వచ్చి, మద్యం దుకాణం వద్దని నిరసన చేస్తారా.. మీ తలలు పగలగొడతామని బెదిరించారని సరస్వతి తెలిపారు. తాగునీటి వనరులు, జనావాసాల నడుమ షాపు వద్దంటే ఇలా భయపెట్టడం న్యాయమేనా అని నిలదీశారు. అనసూయ మాట్లాడుతూ తమ ఇంటికి కూడా నిన్న రాత్రి ఇద్దరు ఆగంతకులు వచ్చి, బెదిరించారని ఆరోపించారు. ఇదేనా మహిళలకు ఇచ్చే గౌరవం అని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి, ఫిర్యాదు చేశారు.

జాతీయస్థాయి పోటీలకు నెమలాం విద్యార్థులు

తెర్లాం: బాల్ బ్యాడ్మింటన్ జాతీయస్థాయి పోటీలకు తెర్లాం మండలంలోని నెమలాం హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ఈ నెల 9, 10తేదీల్లో రాజమండ్రిలో జరిగాయి. ఈ పోటీల్లో రాష్ట్ర జట్టు సభ్యులు అత్యుత్తమ ఆటతీరును కనబరిచారు. ఈ పోటీల్లో పాల్గొన్న నెమలాం హైస్కూల్ విద్యార్థులు ఎస్.మనోజ్, లక్ష్మణ్, సాయి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, పీడీ సింహాచలం, ఉపాధ్యాయులు పాఠశాలలో మంగళవారం అభినందించారు. జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి, జిల్లాకు, పాఠశాలకు పేరు తీసుకురావాలని హెచ్ఎం శ్రీనివాసరావు, పీడీ సింహాచలం కోరారు.

యంత్రం.. సాగు మంత్రం..!

- వ్యవసాయంలో పెరుగుతున్న యాంత్రీకరణ
- వరికోత, నూర్పిడి పనులకు అందుబాటులో ఆధునిక పరికరాలు
- కూలీల కొరత నివారణతో పాటు తగ్గనున్న పెట్టుబడి ఖర్చు
- ప్రతికూల వాతావరణానికి సర్దుబాటుగా యంత్రాల వినియోగం
- వరి సాగులో యంత్ర పరికరాల వినియోగంపై రైతుల దృష్టి


ఉనుకూరులో కంబైన్డ్ హార్వెస్టర్‌తో వరిపంట కోత, నూర్పిడి పనులు


వరి నూర్పిడి యంత్రంతో పొలాల్లోనే ధాన్యం సేకరణ

రాజాం: కూలీల కొరత భయం రైతులను నిత్యం వెంటాడుతోంది. వ్యవసాయంలో మానవ వనరులు రానురాను తగ్గుతున్న ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో అన్నదాతల ముందున్న ఏకైక ప్రత్యామ్నాయ మార్గంగా యాంత్రీకరణ నిలుస్తోంది. సాగులో ఆధునిక పరికరాల వినియోగంతో ప్రతికూల పరిస్థితులు, కూలీల కొరతను అధిగమించడం సహా సమయం ఆదా అవ్వడం, పెట్టుబడి ఖర్చు తగ్గుతుండడం వంటి అంశాలు వ్యవసాయదారులను ప్రధానంగా ఆకర్షిస్తున్నాయి. దీంతో వారు కూడా వ్యవసాయానికి యంత్ర పరికరాలు వాడేందుకు ఆసక్తి చూపిస్తుండడం విశేషం. ఒకప్పుడు పెద్దపెద్ద పట్టణాలకే పరిమితమైన యంత్ర సామగ్రి ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లోకి కూడా వచ్చేయడం గమనార్హం. అవేంటో ఇప్పుడు చూద్దాం..

కంబైన్డ్ హార్వెస్టర్..

వరి కోతతో పాటు నూర్పిడి వెంటనే చేసే యంత్రమే కంబైన్డ్ హార్వెస్టర్. ఈ యంత్రం ఇప్పుడు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో తిరుగుతోంది. రూ.30 లక్షల నుంచి ఈ యంత్రాలు ఉండగా, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి రైతులు ఇక్కడకు ఈ సీజన్‌లో అద్దెకు తీసుకుస్తున్నారు. గంట వ్యవధిలో పంటను నూర్పిడి చేసి, ధాన్యాన్ని అందించే ఈ యంత్రం గంటకు రూ.2 వేల అద్దె తీసుకుంటుంది. కూలీల కొరతను నివారించేందుకు రేగిడి, సంతకవిటి మండలాల్లో పెద్దపెద్ద రైతులు ఈ యంత్రాలు అధికంగా వినియోగిస్తున్నారు.

థ్రెషర్ మిషన్(నూర్పిడి యంత్రం)..

ఇవి గత ఆరేడేళ్లగా గ్రామాల్లో దర్శనమిస్తున్నాయి. పంటపొలాల్లో కోసిన పంటను అదే పొలంలో రైతులు ఒకట్రెండు రోజుల పాటు కుప్పలుగా పెట్టి, ఆరబెట్టిన తర్వాత అక్కడికే ఈ యంత్రాన్ని ట్రాక్టరు ద్వారా తీసుకువెళ్లి నూర్పిడి చేస్తున్నారు. రూ.1.90 లక్షల నుంచి ఈ యంత్రాలు లభిస్తున్నాయి. వీటిని పదెకరాలు దాటి ఉన్న రైతులు సొంతంగా కొనుగోలుచేస్తుండగా, మరికొంతమంది అద్దెకు తెచ్చుకుంటున్నారు. ఈ యంత్రం ద్వారా నూర్పిడి చేసేందుకు ఎకరా పొలానికి రూ.1500లు వరకు వసూళ్లు చేస్తున్నారు.

బ్రష్ కట్టర్

ఐదేళ్ల క్రితమే మార్కెట్‌లోకి వచ్చిన బ్రష్ కట్టర్ ప్రారంభంలో రైతు వినియోగానికి ఉపయోగపడలేదు. ఈ యంత్రంలో చేర్పులు మార్పులు చేయడంతో ఇప్పుడు రైతులు విరివిగా దీనిని వినియోగిస్తున్నారు. రూ.26 వేల నుంచి లభించే ఈ యంత్రం ద్వారా ఒక రైతు రెండు గంటల వ్యవధిలో ఎకరా పొలాన్ని అవలీలగా కోత చేయగలరు. ఈ యంత్రం ద్వారా రబీ సీజన్‌లో వేసే ఆరుతడి పంటలు కూడా పోయే ప్రమాదం ఉండదు. దీంతో ఇటీవల ఈ యంత్రాన్ని రైతులు ఎక్కువగా వినియోగిస్తున్నారు.

పాడీ రీపర్..

ఈ యంత్రం ఇటీవల ఎక్కువగా వినియోగంలోకి వచ్చింది. రూ.70 వేల నుంచి అందుబాటులో ఉండే ఈ యంత్రం ద్వారా రైతు పొలంలో సులభంగా గంట వ్యవధిలో ఎకరా పొలాన్ని కోత చేయవచ్చును. ఇటీవల ఈ యంత్రాన్ని పవర్ టిల్లర్‌లకు, మినీ ట్రాక్టర్లకు వినియోగించి, కట్ చేస్తున్నారు. ఈ యంత్రం వినియోగంతో కూలీల కొరతను నివారించుకునే అవకాశం ఉంది.

మూడేళ్లుగా వాడుతున్నా..



గత మూడేళ్లగా మా వరిపొలాల్లో కోతతో పాటు నూర్పిడికి ఆధునిక యంత్రాలు వాడుతున్నాను. ఈ ఏడాది కంబైన్డ్ హార్వెస్టర్ తీసుకువచ్చాను. 30 ఎకరాల వరి పంట కోతను వారం రోజుల్లో పూర్తి చేసింది. కోతతో పాటు నూర్పిడి కూడా చేస్తుంది. మిగిలిన పొలాన్ని సీడ్స్ నిమిత్తం సాధారణ రైతు వారీ పనులతో పూర్తి చేయిస్తున్నాను.

గేదెల వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ అధ్యక్షుడు, ఉనుకూరు, రేగిడి మండలం

రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు..



రైతులు ఎక్కువగా పాడీ రీపర్‌ను వినియోగిస్తున్నారు. పవర్ టిల్లర్‌తో ఈ యంత్రం వినియోగం ద్వారా పని సులభంగా అవుతుంది. కూలీల కొరతతో పాటు పెట్టుబడి మదుపులు తగ్గుతున్నాయి. రైతులు ఎక్కువగా సాంకేతిక వ్యవసాయంపై మొగ్గుచూపుతున్నారు.

కె.చంద్రరావు, వ్యవసాయ శాఖ ఏడీఏ, రాజాం


బ్రష్ కట్టర్ వినియోగం ఇలా..


పాడీ రీపర్‌తో వరికోతలు..

పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

రామభద్రపురం: జీడిమామిడి పంటలకు సంబంధించి, ఎకరానికి రూ.1500 చొప్పున బీమా ప్రీమియం చెల్లించాలని మండల ఉద్యానశాఖాధికారి పి.మోహనకృష్ణ రైతులకు సూచించారు. ఇదే విషయమై స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలో 600 ఎకరాల్లో జీడిమామిడి సాగు జరుగుతోందన్నారు. పంటల బీమా ప్రీమియం చెల్లిస్తే ఎప్పుడైనా ప్రకృతి విపత్తుల ద్వారా పంట నష్టం జరిగితే ఎకరానికి రూ.30 వేల చొప్పున నష్ట పరిహారం ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే ఆయిల్‌పామ్ సాగుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ఈ ఏడాది మండలంలో 100 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగును లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కూరగాయ పంటలు వేసిన రైతులు నారు, విత్తనాలు కొనుగోలుకు సంబంధించిన బిల్లులు తీసుకువచ్చి, రైతు సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకుంటే 50 రాయితీ వర్తిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

సబ్సిడీ ఇప్పించండి సారూ..


సబ్సిడీ ఇప్పించాలని మొర పెట్టుకుంటున్న శ్రీనివాసరావు

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురం వద్ద బొద్దూరుకు చెందిన దువ్వారపు శ్రీనివాసరావు ఏర్పాటు చేసుకున్న ఫిష్ ఆంధ్ర–పున్నమ్మ లైవ్ ఫిష్ సెంటర్‌ను రాష్ట్ర ఫిషరీస్, యానిమల్ హస్బెండరీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.ఎం.నాయక్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ షాపు యజమాని శ్రీనివాసరావు తనకు రావాల్సిన సబ్సిడీ మొత్తం ఇప్పించాలని సెక్రటరీ వద్ద మొర పెట్టుకున్నాడు. దీంతో పక్కనే ఉన్న డీఎఫ్‌వోను సెక్రటరీ ప్రశ్నించగా, సబ్సిడీ మొత్తం జమ అయిందని తెలిపారు. తన అకౌంట్‌కు జమ కాలేదని వేరే ప్రైవేటు వెండర్ జమ చేసుకున్నారని శ్రీనివాసరావు వివరించారు. తనకు ఎలాగైనా న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఆయన.. సబ్సిడీలో అవకతవకలు జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుని, బాధిత యజమానికి న్యాయం జరిగేలా చూస్తానని అన్నారు.

పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలి

రేగిడి: గ్రామ పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలని, ఆ దిశగా పంచాయతీ కార్యదర్శులు సేవలందించాలని ఎంపీడీవో శ్యామలాకుమారి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జీపీడీపీ(గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు) తయారీపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని, అభివృద్ధి పనులు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: గ్రామాల అభివృద్ధికి చక్కని ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా పరిశీలకులు నాగరాజు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందికి 2025–26 ఏడాదికి సంబంధించి గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు తయారు చేయాలని తెలిపారు. పనులకు సంబంధించిన వివరాలను గ్రామస్వరాజ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, ఎంఈవో ప్రవీణ్‌కుమార్, ఏపీవో కె.సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

వంగర: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీవో లోపింటి త్రినాథ్, ఈవోపీఆర్‌డీ కెల్ల రామారావులు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశమైన వారు.. ప్రజలకు అవసరమైన పనులు తీరేలా అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలని తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



రాజాం మండలం, మెంతిపేట బాలభవన్ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన శాస్త్రీయ నృత్య పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ నెల 14న బాలల దినోత్సవం పురస్కరించుకుని, రాజాం, పాలకొండ, చీపురుపల్లి, సంతకవిటి తదితర మండలాల నుంచి మొత్తం 250 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని, వ్యక్తిగత, బృంద ప్రదర్శనలతో అలరించారు. విజేతలకు బాలల దినోత్సవం రోజున బహుమతులు అందిస్తామని బాలభవన్ డైరెక్టర్ ఎస్.రమేష్ తెలిపారు. – రాజాం

బ్రిటిష్ కాలం నాటి ఎయిర్‌స్ట్రిప్ సందర్శన



బాడంగి మండల కేంద్రానికి దగ్గరలోని బ్రిటిష్ కాలం నాటి ఎయిర్‌స్ట్రిప్‌ను విశాఖపట్నం నావికాదళ అధికారులు ఆర్.సుబ్బారావు, జీవీఎస్ చైతన్యలు మంగళవారం సందర్శించారు. 1943లో ఇక్కడ ఏర్పాటు చేసిన ఎయిర్‌స్ట్రిప్ అనివార్య కారణాల వల్ల నిలుపుదల చేశారు. ఆ తర్వాత అది మరుగునపడింది. ప్రస్తుతం అదే స్థలంలో యుద్ధ సామగ్రి భద్రపరిచేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సదరు అధికారులు ఇక్కడి రెవెన్యూ అధికారులతో కలిసి మంగళవారం ఎయిర్‌స్ట్రిప్ ప్రదేశానికి వెళ్లి, ఆ స్థలానికి సంబంధించిన మ్యాప్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎయిర్‌స్ట్రిప్ స్థలంతో పాటు 1700 ఎకరాల భూమిని తమకు అవసరమని అప్పగించాలని వారు కోరారు. గత మూడేళ్లుగా ఇదే తంతు జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. –బాడంగి

పిక్నిక్ సందడి



కార్తీకమాసం వేళ పిక్నిక్ సందడి మొదలైంది. రాజాం జీఎంఆర్ ఐటీ రోడ్డు సహా గారాజుచీపురుపల్లి, పొగిరి, కొత్తపేట తదితర గ్రామాల మామిడి తోటల్లో పలువురు మంగళవారం పిక్నిక్ చేసుకుని, వనభోజనాలు చేశారు. సాయంత్రం ఆటపాటలతో సరదాగా గడిపారు. –రాజాం

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు మంగళవారం నిర్వహించారు. వేకువజామునే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, ఆలయాలకు చేరుకుని దైవదర్శనం చేసుకున్నారు. ప్రత్యేక పూజలు, దీపారాధనలు, సామూహిక వ్రతాలు నిర్వహించారు. అష్టైశ్వర్యాలు, ఆయురోగ్యాలు ప్రసాదించాలని భగవంతుడిని మనసారా వేడుకున్నారు. ప్రతిచోటా జరిగిన ఈ పూజలతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్


బొబ్బిలి: ఏకాదశి దీపాలు వెలిగిస్తున్న మహిళలు


రామభద్రపురంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో భక్తుల పూజలు


బాడంగి: పాల్తేరులో సామూహిక వ్రతాల్లో పాల్గొన్న భక్తులు


సంతకవిటి: ఎం.ఆర్.అగ్రహారంలోని సత్యనారాయణస్వామి ఆలయం వద్ద మహిళల దీపారాధన


రాజాం: మండల కేంద్రంలోని మల్లిఖార్జునస్వామి ఆలయం వద్ద మహిళల దీపారాధన


వంగర: సంగాం శివాలయంలో శివలింగానికి పూజలు చేస్తున్న దృశ్యం


తెర్లాం: నందబలగ శివాలయంలో జరిగిన దీపారాధన దృశ్యం

సంక్షిప్తంగా..

రూ.కోటి పైగా అప్పులతో వ్యాపారుల పరార్!

రాజాం సిటీ: నమ్మకమే పెట్టుబడిగా జరుగుతున్న మోసాలకు రాజాం అడ్డాగా మారింది. సరిగ్గా రెండు నెలల క్రితం శ్రీకాకుళం రోడ్డులోని ఓ గ్లాస్ హౌస్ యజమాని అప్పుల పాలై ఐపీ పెట్టిన విషయం మరువకముందే ఆలస్యంగా మరో ఘటన వెలుగులోకి వచ్చింది. మాధవబజార్‌తో పాటు బస్టాండ్‌కు వెళ్లే దారిలో వ్యాపారాలు నిర్వహించిన ఇద్దరు అన్నదమ్ములు ఏకంగా రూ.కోటికి పైగా అప్పులతో పరారయ్యారు. ప్రస్తుతం వారి బారిన పడిన బాధితులకు ఐపీ నోటీసులు అందడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాలిలా.. పాతబస్టాండ్, మాధవబజార్‌లలో గిరి, ఈశ్వరరావులు బ్యాంగిల్ షాపులు నిర్వహిస్తుండేవారు. ఇదే అదునుగా అప్పులు చేయడం, అలాగే చిట్టీలు కట్టిన వారికి డబ్బులు ఇవ్వకపోవడం ప్రారంభించారు. ఇవి ఎక్కువ కావడంతో వారిద్దరూ గత కొన్నిరోజులుగా కనిపించలేదు. దీంతో అప్పులు ఇచ్చిన వారు ఆరా తీయడం ప్రారంభించారు. ప్రస్తుతం బాధితులకు ఐపీ నోటీసులు రావడంతో ఆందోళన చెందుతున్నారు. వారి బారినపడిన దాదాపు 40 మంది వరకు విషయం ఎవరికీ చెప్పుకోలేక, బయటపడలేక గుంబనంగా ఉంటున్నారు. కొంతమంది ఐపీ నోటీసులు అందుకున్న బాధితులు బయటపడుతూ లబోదిబోమంటున్నారు. అయితే ఈ విషయంపై ఇంతవరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని పోలీసులు మంగళవారం తెలిపారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించాలి

రేగిడి: ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించి, సాగు చేస్తే అధిక దిగుబడులు పొందే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ శాఖ జేడీ వీటీ రామారావు అన్నారు. మండలంలోని చాటాయివలస గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి హాజరైన ఆయన.. గ్రామానికి చెందిన పలువురు రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలు అనుసరిస్తూ పండిస్తున్న పంటలను ఆయన పరిశీలించారు. ప్రకృతి సేద్యం ద్వారా ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగబడులు వస్తాయన్నారు. అనంతరం నీమాస్త్రం, జిల్లేడు ద్రావణం, జీవామృతాల తయారీని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ చంద్రరావు, ఏవో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

మెంటాడ: మండలంలోని గుర్లతమ్మిరాజుపేట, ఆంధ్ర, పిట్టాడ గ్రామాల్లో ఎంపీడీవో కూర్మనాథ పట్నాయక్ మంగళవారం పర్యటించి, అక్కడి ప్రభుత్వ పాఠశాలలు, సచివాలయాలను సందర్శించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో జరుగుతున్న ఓడీఎఫ్ తదితర సర్వేలతో పాటు పాఠశాలల్లో చేపడుతున్న అపార్ నమోదును వేగవంతం చేయాలని తెలిపారు. అలాగే ఆయా పాఠశాలల్లో విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను తనిఖీ చేసిన ఆయన.. మెనూ ప్రకారం వంటకాలు వండిపెట్టాలని సిబ్బందికి సూచించారు. ఆహార పదార్థాలు రుచి, శుచి కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని పాలకొండ రోడ్డులోని ప్రాంతాలకు ఈ నెల 13వ తేదీన విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏఈ ఓజేసీఏ కుమార్ ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మారుతీనగర్, పొనుగుటివలస, డోలపేట, బుచ్చెంపేట ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నామన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా చేపట్టే చెట్ల తొలగింపు నేపథ్యంలో ఈ అసౌకర్యం కలుగుతోందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్కూటీకి దుండగుల నిప్పు

బొబ్బిలి: పట్టణంలోని గొల్లపల్లికి చెందిన చింతల గోపి అనే వ్యక్తికి చెందిన స్కూటీని కొంతమంది గుర్తు తెలియని దుండగులు నిప్పంటించి, తగలబెట్టారు. ఈ విషయమై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్ మంగళవారం తెలిపారు. తన ఇంటి ముందు పార్క్ చేసిన స్కూటీని సోమవారం తెల్లవారుజామున కాల్చివేశారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలి

వంగర: సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని తహసీల్దారు దిరిశాల ధర్మరాజు సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో మంగళవారం సమావేశమైన ఆయన.. ఈ నెల 21న జరగనున్న ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.

ఇంటింటా సర్వే

వంగర: మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి నారాయణరావు ఆధ్వర్యంలో ఇంటింటా సర్వే మంగళవారం నిర్వహించారు. మరుగుదొడ్లు ఉన్న ఇళ్లు ఎన్ని.. మరుగుదొడ్లు లేని ఇళ్లు ఎన్ని అనే వివరాలను సేకరించారు. మరుగుదొడ్లు లేని ఇళ్లకు మరుగుదొడ్లు మంజూరు చేయడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

రాజాం:మండలంలోని పొగిరి, బొద్దాం, పెనుబాక, రాజయ్యపేట గ్రామాల్లో జరిగిన ఇంటింటా సర్వేను ఎంపీడీవో వి. శ్రీనివాసరావు పరిశీలించి, పలు సూచనలు చేశారు. సర్వే సక్రమంగా చేపట్టాలని, వివరాలన్నీ నమోదు చేయాలని తెలిపారు.

'పొలం పిలుస్తోంది'

బొబ్బిలిరూరల్: మండలంలోని కృష్ణాపురం, కారాడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యామసుందర్ అపరాల సాగులో కలుపుమొక్కల నివారణపై రైతులకు పలు సూచనలు చేశారు. వరి కోతల అనంతరం అపరాలను సాగు చేసుకోవాలని తెలిపారు.

బెల్టు షాపులపై నిఘా

వంగర: గ్రామాల్లో మద్యం బెల్టుషాపులు నిర్వహించకుండా ప్రత్యేక నిఘా ఉంచాలని సీఐ ఉపేంద్రరావు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సచివాలయాల మహిళా పోలీసులతో మంగళవారం సమావేశమైన ఆయన.. బెల్టుషాపులు ఏర్పాటు చేసిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని తెలిపారు.

అపార్ నమోదు వేగవంతం చేయాలి

రేగిడి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అపార్ నమోదును వేగవంతం చేయాలని ఎంఈవో బి.ఎరకయ్య సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపడుతున్న అపార్ నమోదు ప్రక్రియను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ నెలాఖరులోగా శతశాతం అపార్ నమోదు జరిగేలా చూడాలని వారికి తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

సంతకవిటి: మండలంలోని జావాం గ్రామంలో ఉన్న వీరభద్రస్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం భక్తులు ఆలయానికి చేరుకుని, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా ప్రదర్శించిన శ్రీరామచరిత్ర అనే బుర్రకథ ఆద్యంతం ఆకట్టుకుంది.

ఆధార్ సేవల పరిశీలన

బొబ్బిలిరూరల్: మండలంలోని ఎం.బూర్జివలస, పెంట గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు కేంద్రాల సేవలను ఎంపీడీవో పి.రవికుమార్ మంగళవారం పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థుల అపార్ నమోదుకు ఆధార్ తప్పనిసరి అని, ఈ నేపథ్యంలో ఆధార్ సేవలను సక్రమంగా అందించాలని తెలిపారు.

శతశాతం ఫలితాలు సాధించాలి

రేగిడి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో శతశాతం ఫలితాలు సాధించాలని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని దేవుదళ, లక్ష్మీపురం, సంకిలి గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను మంగళవారం సందర్శించిన ఆయన.. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన కొనసాగించాలని తెలిపారు.

రైతులకు తుపాను భయం

రాజాం/సంతకవిటి/బాడంగి: మండలాల రైతులకు తుపాను భయం పట్టుకుంది. చాలా ప్రాంతాల్లో ఇప్పటికే వరికోతలు పూర్తి చేసి, నూర్పిడికి చేను సిద్ధం చేశారు. ఈ తరుణంలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఏ క్షణాన వానలు పడతాయోనని భయాందోళన చెందుతున్నారు. కొన్నిచోట్ల ఆకాశం మేఘావృతం కావడంతో వరి చేను కుప్పలపై రక్షణగా టార్పాలిన్లు కప్పి ఉంచారు.